సాక్షి రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 20 । ఆగస్టు । 2023



శంభో శంకర

వేములవాడ: రాజన్నను దర్శించుకునేందుకు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు శనివారం పది వేలకు పైగా తరలివచ్చారు.



ఎల్‌ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి ఒక్క గేటు ద్వారా ఎల్‌ఎండీకి 300 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా వెయ్యి క్యూసెక్కుల నీరు తరలుతోంది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.0/23.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

ఎవరి కుర్చీ పదిలం..!?

- పాత జిల్లా బీఆర్‌ఎస్‌లో మారనున్న సమీకరణాలు
- వేములవాడ, ధర్మపురి, కోరుట్లలో మార్పు అనివార్యం
- పెద్దపల్లి జిల్లా అభ్యర్థులందరిపైనా నేతల అసంతృప్తి
- కరీంనగర్‌లోనూ కొన్నిచోట్ల రావాల్సిన స్పష్టత
- తుదిజాబితా కోసం పార్టీలో మొదలైన ఉత్కంఠ



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీలో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ల కేటాయింపు తలనొప్పిగా తయారైంది. సొంత పార్టీలో అసమ్మతి నేతలు వేర్వేరు కుంపట్లు పెట్టి సిట్టింగ్‌లకు సీట్లు ఇస్తే సహకరించేది లేదని, తమలో ఒకరికి ఇస్తే కలిసి పనిచేస్తామని అధిష్టానానికి సంకేతాలు పంపుతున్నారు. రోజుకో నియోజకవర్గంలో అసమ్మతివాదుల సంఖ్య పెరుగుతుండడం.. ఏకంగా పార్టీ కార్యాలయాలు ఓపెన్ చేయడం, శుభ, అశుభ కార్యక్రమాలకు వెళ్తూ ప్రజలతో మమేకమవుతుండడంతో క్షేత్రస్థాయి క్యాడర్ అయోమయానికి గురవుతోంది. పార్టీ అధిష్టానం నుంచి రెండు, మూడు రోజుల్లో మొదటి విడత జాబితా వస్తుందంటూ వస్తున్న సంకేతాలతో ఉన్న సీటు ఉంటదా..? ఊడుతుందా..? అనే సందిగ్ధంలో ప్రస్తుత ఎమ్మెల్యేలు ఉన్నారు. ద్వితీయశ్రేణి నాయకులు మాత్రం టికెట్ తమకే అంటూ ఎవరి స్టైల్‌లో వారు నియోజకవర్గకేంద్రాలు, మండలాల్లో పర్యటిస్తున్నారు. మరోవైపు పార్టీలో జరుగుతున్న తతంగంపై పార్టీ అధిష్టానం ఒకింత దృష్టి సారిస్తూనే అసమ్మతివాదులను బుజ్జగిస్తూ.. వివాదాలు లేకుండా చేసే ప్రయత్నంలో ఉంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సీట్ల కేటాయింపు విషయానికి వస్తే వేములవాడ, రామగుండం, మంథని, పెద్దపల్లి, చొప్పదండి తదితర నియోజకవర్గాలలో సొంత పార్టీ నుంచే తీవ్ర అసమ్మతిని ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇది సీట్ల కేటాయింపులో పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారిందని చెప్పవచ్చు.

కరీంనగర్ జిల్లా...

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను మార్చాల్సిందేనంటూ ఆ నియోజకవర్గానికి చెందిన కొంతమంది ప్రజాప్రతినిధులు ఇటీవల కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో సమావేశమై ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలోనే తిరుగుబాటు బావుటా ఎగరవేశారు. వారి అసమ్మతిని చల్లార్చేందుకు మంత్రి గంగుల మంతనాలు జరుపుతున్నారు. అక్కడి నుంచే టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య సొంత పార్టీలోనే రోజురోజుకూ పెరుగుతోంది. మాజీ ఆర్డీవో బైరం పద్మయ్య, కరీంనగర్ కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, కత్తెరపాక కొండయ్య, బండపల్లి యాదగిరి, గంట కళ్యాణి శ్రీనివాస్ పార్టీ అధిష్టానం వద్ద అభ్యర్థనలు పెట్టుకుని ప్రచారం చేసుకుంటున్నారు.
- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు టికెట్ ఖాయమనే ప్రచారం జరుగుతున్నా మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఓరుగంటి ఆనంద్ పార్టీ అధిష్టానం వద్ద ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు సమాచారం.
- హుజూరాబాద్ సీటు కేటాయింపు విషయంలో గతంలోనే జమ్మికుంటలో జరిగిన బహిరంగ సభలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు తదితరులు ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డికి టికెట్ ఖాయమని సంకేతాలు ఇచ్చారు. హుస్నాబాద్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న వొడితెల సతీష్‌బాబు సైతం హుజూరాబాద్ నుంచి పోటీ చేసే విషయంలో ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. హుస్నాబాద్ సీటును పొత్తులో భాగంగా సీపీఐకి కేటాయిస్తే సతీష్‌బాబు హుజూరాబాద్‌కు రావడం ఖాయమనే ప్రచారం జరుగుతోంది. కానీ ఇటీవలే అక్కడి పార్టీ నేతలు పొనగంటి మల్లయ్య, తుమ్మేటి సమ్మిరెడ్డి అసమ్మతి రాగం వినిపిస్తున్నారు. అక్కడి నుంచే ఇటీవల పోటీ చేసి ఓడిపోయిన పర్యాటక సంస్థ అభివృద్ధి చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ సతీమణిని సైతం బరిలో దించే అవకాశాలను అధిష్టానం పరిశీలిస్తున్నట్లు సమాచారం.
- కరీంనగర్ ఎమ్మెల్యేగా ఉన్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ మరోసారి టికెట్ దక్కించుకుని నాలుగో సారి ఎమ్మెల్యేగా గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. పార్టీలో అసమ్మతి ఏమీ లేకపోవడంతో టికెట్ ఖాయమనే ప్రచారం జరుగుతోంది.

జగిత్యాల జిల్లా...

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు టికెట్ కేటాయించే విషయంపై పార్టీలో కొంత అసమ్మతి నెలకొంది. టీఆర్‌ఎస్ సీనియర్ నేతలు ఓరుగంటి రమణారావు, పి.జితేందర్‌రావులు టికెట్ కోసం పార్టీ అధిష్టానంపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం.
- కోరుట్ల ఎమ్మెల్యేగా ఉన్న విద్యాసాగర్‌రావు అభ్యర్థిత్వాన్ని వీలైతే మార్చి అతని కుమారుడు డాక్టర్ సంజయ్‌ని బరిలో దింపే అవకాశాలపై పార్టీ అధిష్టానం దృష్టి సారించింది.
- ధర్మపురి ఎమ్మెల్యేగా కొనసాగుతున్న ప్రస్తుత ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను పార్టీ అధిష్టానం తాను కోరుకుంటే తప్ప అభ్యర్థిత్వాన్ని మార్చబోదని సమాచారం. పెద్దపల్లి ఎంపీగా కొప్పుల ఈశ్వర్ అభ్యర్థిత్వాన్ని పార్టీ పరిశీలిస్తే ధర్మపురిలో ఎమ్మెల్యే అభ్యర్థి మారే అవకాశాలు ఉండనున్నాయి.

సిరిసిల్ల జిల్లా...

- వేములవాడ ఎమ్మెల్యేగా ఉన్న చెన్నమనేని రమేశ్ అభ్యర్థిత్వం ఈసారి మార్పు తప్పదంటూ పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. పౌరసత్వ వివాదం తేలకపోవడం.. ప్రజలకు అందుబాటులో ఉండరనే ఆరోపణలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి గతంలో బీఆర్‌ఎస్‌లో చేరిన చల్మెడ లక్ష్మీనరసింహారావుకు టికెట్ కేటాయింపు ఉంటుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ మేరకు పార్టీ అధిష్టానం సూచనతోనే ఎన్నికల కార్యాలయం ఓపెన్ చేసి ప్రచార పర్వాన్ని కొనసాగిస్తున్నారు. ఆ ప్రాంతానికి చెందిన ఏనుగు మనోహర్‌రెడ్డి, ఎన్ఆర్ఐ డాక్టర్ గోలి మోహన్ కూడా పార్టీ అధిష్టానం వద్ద తన పేరు పరిశీలించాలని కోరుతున్నట్లు సమాచారం.
- సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఉన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు టికెట్ ఖాయం. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పేరిట జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ మరోసారి విజయఢంకా మోగించేందుకు తనదైన శైలిలో ప్రచారపర్వంలో దూసుకుపోతున్నారు.

పెద్దపల్లి జిల్లాలో...

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు టికెట్ ఇస్తే సహకరించేది లేదని ఏకంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు నియోజకవర్గకేంద్రంలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా అసమ్మతివాదులంతా ఏకమై పోటీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ, బొగ్గుగని కార్మిక సంఘం నేత మిర్యాల రాజిరెడ్డి తదితరులు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వేరుకుంపటి తయారు చేసి తమ పనిలో నిమగ్నమయ్యారు. ఎమ్మెల్యేగా ఉన్న కోరుకంటి చందర్ ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడిగానూ కొనసాగుతున్నారు. తాజాగా బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కౌశిక హరిని శుక్రవారం హైదరాబాద్ తీసుకెళ్లి ప్రగతిభవన్‌లో పార్టీ అధిష్టానంతో మాట్లాడించడంతో హరి చేరిక ఖాయమైంది. ఈ పరిణామంతో రామగుండం రాజకీయం రసకందాయంలో పడింది.
- మంథని నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకు టికెట్ కేటాయించవద్దని ఇటీవలే ఆ ప్రాంత మాజీ ప్రజాప్రతినిధులు నాగినేని జగన్‌మోహన్‌రావు, మైదం భారతివరప్రసాద్, బందం వసంతరెడ్డి తదితరులు తేల్చిచెప్పడంతో పార్టీ అధిష్టానం మంథనిపై ఫోకస్ పెట్టింది. కాటారం మాజీ జెడ్పీటీసీ చల్ల నారాయణరెడ్డి సైతం టికెట్ రేస్‌లో ఉన్నట్లు వినికిడి. జెడ్పీ చైర్మన్‌గా ఉన్న పుట్ట మధు మాజీ ఎమ్మెల్యే కావడం.. పార్టీలో బలమైన నాయకుడు కావడంతో టికెట్ ఆయనకే దక్కే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.
- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి మరోసారి టికెట్ కేటాయింపు వద్దని మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్.రాజయ్య నిరసన వ్యక్తం చేసి ఏకంగా పార్టీకి గుడ్‌బై చెప్పారు. వారంతా ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. నల్ల మనోహర్ రెడ్డి, బొద్దుల లక్ష్మణ్ సైతం పార్టీ అధిష్టానం వద్ద తమ అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరినట్లు వినికిడి. నియోజకవర్గవ్యాప్తంగా ఎమ్మెల్యే తీరుపై సొంత పార్టీ నేతలే అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా.. టికెట్ కేటాయింపు వ్యవహారం ఎటు దారి తీస్తుందో వేచిచూడాల్సిందే.

న్యూస్‌రీల్

మత్తడి మరమ్మతుకు ప్రతిపాదనలు



తెగిన మత్తడిని పరిశీలిస్తున్న ఆగయ్య

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని భీమునిమల్లారెడ్డిపేట పెద్ద చెరువు మత్తడి మరమ్మతు పనులకు ప్రతిపాదనలు చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఇరిగేషన్ అధికారులను కోరారు. శనివారం పెద్ద చెరువు పరిస్థితులను పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మత్తడి దుకడంతో కింది భాగం తెగిపోయిందన్నారు. సర్పంచ్ మహేశ్వరి, ఎంపీటీసీ రాజేందర్, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు హన్మండ్లు, రైతులు ఉన్నారు.

'బీఆర్‌ఎస్ నాయకులకే మైనార్టీ బంధు'



రాస్తారోకో చేస్తున్న ముస్లింలు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటలో అర్హులైన వారికి మైనార్టీబంధు అందడం లేదని, బీఆర్‌ఎస్ నాయకులకే ఇస్తున్నారంటూ ముస్లిం నాయకులు శనివారం రోడ్డెక్కారు. ప్రధాన రహదారిపై బైఠాయించారు. వారు మాట్లాడుతూ పూర్తిస్థాయిలో మైనార్టీలకు రుణాలు అందడం లేదన్నారు. అర్హులైన వారికి మైనార్టీ రుణాలు అందించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హమీద్ తదితరులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి



రెండో ఏఎన్‌ఎంలకు సంఘీభావం తెలుపుతున్న కూర రాజన్న

సిరిసిల్లటౌన్: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉంటున్న రెండో ఏఎన్‌ఎంల సమస్యలు వెంటనే పరిష్కరించాలని జనశక్తి అగ్రనేత కూర రాజన్న కోరారు. సిరిసిల్లలో నిరవధిక దీక్షా శిబిరాన్ని శనివారం సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ ఏళ్లుగా వెట్టిచాకిరీకి గురవుతున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా ఉండడాన్ని ప్రశ్నించారు. ఏఐటీయూసీ నాయకులు కడారి రాములు, అంగూరి రంజిత్ ఏఎన్‌ఎంలకు సంఘీభావం తెలిపారు. దీక్షల్లో వనజ, రేణుక, విజయలక్ష్మి, శ్రీలత, పద్మ, మాధవి, రేఖ, రాజేశ్వరీ, పద్మ, సరోజ, ఇందిర, కరుణశ్రీ, సునంద పాల్గొన్నారు.

21న ప్రజావాణి రద్దు

సిరిసిల్ల: కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిని ఈనెల 21న రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి శనివారం ప్రకటించారు. జిల్లాలో అన్ని ప్రాంతాల ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఎవరూ సోమవారం కలెక్టరేట్‌కు వినతిపత్రాలు అందించేందుకు రావొద్దని కోరారు.

ఐదు మార్కెట్ కమిటీ చైర్మన్ల ఖరారు

- మంత్రి కేటీఆర్ సూచనలతో జాబితా సిద్ధం
- అధికారిక ఉత్తర్వులే తరువాయి

సిరిసిల్ల: సిరిసిల్ల నియోజకవర్గంలోని ఐదు వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్లను ఖరారు చేశారు. సిరిసిల్ల ఏఎంసీ చైర్మన్‌గా పూసపల్లి సరస్వతి(జిల్లెల్ల), పోత్గల్(ముస్తాబాద్) ఏఎంసీ చైర్మన్‌గా అక్కరాజు శ్రీనివాస్, ఎల్లారెడ్డిపేట(రాచర్ల బొప్పాపూర్) ఏఎంసీ చైర్మన్‌గా ఎలుసాని మోహన్ కుమార్, గంభీరావుపేట ఏఎంసీ చైర్మన్‌గా హన్మంతరెడ్డి (దమ్మన్నపేట), వీర్నపల్లి ఏఎంసీ తొలి చైర్మన్‌గా రాజిరెడ్డి(అడవిపదిర)లను నియమించినట్లు సమాచారం. ఈమేరకు మంత్రి కేటీఆర్ ఆదేశాలతో ఆయా మార్కెట్ కమిటీలకు వైస్‌చైర్మన్, డైరెక్టర్ పోస్టులనూ నియమించినట్లు తెలిసింది. ఈమేరకు ఏఎంసీ పాలకవర్గాల నియామకపు ఉత్తర్వులు రెండు, మూడు రోజుల్లో వెలువడనున్నాయి. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ద్వారా అన్ని మార్కెట్ కమిటీల పాలకవర్గాల పేర్లను వెల్లడించినట్లు సమాచారం. మంత్రి కేటీఆర్ అమెరికా పర్యటనకు వెళ్లే ముందే పార్టీ ముఖ్యనేతలతో చర్చించి ఏఎంసీలను ఖరారు చేశారు. ప్రస్తుతం ఉన్న ఏఎంసీల పదవీకాలం ఇటీవల ముగిసింది. ఆయా స్థానాల్లో కొత్త పాలకవర్గాలు నియామకం కానున్నాయి.

ఫొటోగ్రఫీతో జ్ఞాపకాలు పదిలం



ఫొటోగ్రాఫర్లను సన్మానిస్తున్న అరుణ

సిరిసిల్లఅర్బన్: ఫొటోగ్రఫీతో జ్ఞాపకాలు పదికాలాలు పదిలంగా ఉంటాయని, సమాజానికి కళ్లకు కట్టినట్లు చూపెట్టేది చిత్రమేనని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి పురస్కారాలకు ఎంపికైన సీనియర్ ఫొటో జర్నలిస్టులు వంకాయల శ్రీకాంత్, కె.రవికుమార్‌ను శనివారం సన్మానించారు. డీపీఆర్వో దశరథం తన కార్యాలయంలో ఇద్దరికి శుభాకాంక్షలు తెలిపారు. గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య తదితరులు ఉన్నారు.

ముసురుకున్న వర్షం

- జిల్లా అంతటా వాన
- రుద్రంగిలో అత్యధికంగా 70.6 మిల్లీమీటర్లు
- సిరిసిల్లలో అత్యల్పంగా 26.1 మిల్లీమీటర్లు
- మత్తడి దూకుతున్న చెరువులు
- చెరువులను పరిశీలించిన ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి



మత్తడిని పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ

సిరిసిల్ల: జిల్లాను వర్షం ముసురుకుంది. జిల్లా అంతటా శనివారం తుంపర వానలు పడుతూనే ఉన్నాయి. కొద్ది సేపు గెరువు ఇస్తూ మళ్లీ వర్షం పడుతుంది. రుద్రంగిలో అత్యధికంగా 70.6 మిల్లీమీటర్ల వర్షం పడగా.. అత్యల్పంగా జిల్లా కేంద్రంలో 26.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చందుర్తిలో 63.3, వేములవాడరూరల్‌లో 38.4, బోయినపల్లిలో 52.6, వేములవాడలో 42.9, కోనరావుపేటలో 33.5, వీర్నపల్లిలో 34.0, ఎల్లారెడ్డిపేటలో 36.0, గంభీరావుపేటలో 35.1, ముస్తాబాద్‌లో 29.7, తంగళ్లపల్లిలో 28.9, ఇల్లంతకుంటలో 27.3 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. జిల్లాలో చలిగాలులు వీస్తున్నాయి. చలికి జనం గజగజ వణుకుతున్నారు. వర్షాలతో జిల్లాలో సామన్య జనజీవనం స్తంభించింది.

ఈదులచెరువును పరిశీలన

చంద్రంపేట ఈదులచెరువును ఇరిగేషన్‌శాఖ ఈఈ గంగం శ్రీనివాస్‌రెడ్డి శనివారం పరిశీలించారు. స్థానిక కౌన్సిలర్ పాతూరి రాజిరెడ్డి, స్థానికులతో కలిసి ఈదుల చెరువు మత్తడిని చూశారు. ఇటీవల ఈదుల చెరువుకు కొత్తగా కంట్రోల్‌గేటుతో కూడిన మత్తడిని నిర్మించారు. ఈదుల చెరువు నిండితే వెనక వైపు బ్యాక్ వాటర్‌లో రాజీవ్‌నగర్‌కాలనీ ముంపునకు గురవుతుంది. ఈ నేపథ్యంలో ఈదులచెరువుకు కంట్రోల్ మత్తడిగేటును నిర్మించారు. ఈదులచెరువులోకి ఎంత వరద వచ్చినా వెంటనే మత్తడి నుంచి వెళ్లిపోతుంది. జిల్లాలో 122 చెరువులు నిండి మత్తడి దూకుతున్నాయని.. మరో 468 చెరువుల్లో 75 నుంచి 100 శాతం మేరకు నీరు చేరిందని ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో 45 చెరువుల్లో 50 నుంచి 75 శాతం మేరకు నీరు చేరిందన్నారు. జిల్లాలోని 656 చెరువుల్లోనూ నీరు చేరిందని వివరించారు.

అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- మైనార్టీలకు ఆర్థిక సాయం పంపిణీ



చెక్కుపంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, అదనపు కలెక్టర్

సిరిసిల్ల: కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లాలోని 48 మంది మైనార్టీలకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు. అరుణ మాట్లాడుతూ పేదరికాన్ని పారదోలే లక్ష్యంతో సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని మైనార్టీలు ఆర్థికంగా ఎదగాలని కోరారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ మాట్లాడుతూ మైనార్టీల్లోని పేదలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం రూ.లక్షను పూర్తి సబ్సిడీతో అందిస్తుందని తెలిపారు. అర్హులకు దశలవారీగా ఈ పథకం అందుతుందని వివరించారు. జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, జిల్లా రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, మైనార్టీ శాఖ ఓఎస్‌డీ సర్వర్‌మియా, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమా, పూర్మాని మంజుల, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, అహ్మద్, మజీద్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎండీ సత్తార్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టాలి

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్
- కాంగ్రెస్ పార్టీలో 50 మంది చేరిక



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలని, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లికి చెందిన 50 మంది శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ప్రజా వ్యతిరేక విధానాలు పాటిస్తూ జనాన్ని ఇబ్బంది చేస్తున్నాయన్నారు. ఎన్నికల సమయంలో పరిచయాలు పెంచుకుంటున్న నాయకులు కావాలా ? ఓడినా... గెలిచినా ప్రజల వెంట ఉండే నాయకుడు కావాలో ప్రజలు ఆలోచించాలని కోరారు. పిల్లి కనకయ్య, సంగ స్వామి, చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, బొజ్జ భారతి, చిలుక రమేశ్, తూం మధు, కనికరపు రాకేశ్, తోట లహరి, ఎర్రం రాజు, చిలువేరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేములవాడకు ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టోఫర్ తిలక్ రాక

వేములవాడకు ఆదివారం ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టోఫర్ తిలక్ వస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని తాటికొండ ఫంక్షన్‌హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య, వేములవాడ, సిరిసిల్ల ఇన్‌చార్జి సుభాష్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

ఓటరుగా నమోదు కావాలి



వేములవాడలో 5కే రన్



సిరిసిల్ల బతుకమ్మఘాట్ వద్ద అధికారులు

సిరిసిల్ల: పద్దెనిమిదేళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటు హక్కు ఉన్న వారు ఎన్నికల రోజున ఓటు వేయాలని సిరిసిలఆర్డీవో ఆనంద్ కుమార్ కోరారు. సిరిసిల్ల, వేములవాడల్లో శనివారం భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వర్షం పడుతున్నా 5కే రన్ నిర్వహించారు. ఆర్డీవో ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. పేరు లేదని బాధపడేకంటే ముందుగానే ఓటర్ల జాబితాను పరిశీలించి పేరు ఉండేలా చూసుకోవాలని కోరారు. సిరిసిల్ల అంబేడ్కర్ సర్కిల్ వద్ద జెండా ఊపి 5కే రన్‌ను ప్రారంభించారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, మున్సిపల్ కమిషనర్ ఆయాజ్, టీపీవో అన్సార్, ఏఈఆర్‌వో శరీఫ్, ఎన్నికల ఉపతహసీల్దార్ జయంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: రానున్న ఎన్నికల్లో యువతరం ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ శనివారం పట్టణంలోని తెలంగాణచౌక్ నుంచి తిప్పాపూర్ బస్టాండు వరకు 5కే రన్ నిర్వహించారు.

క్లుప్తంగా

30 వరకు ఐటీఐ మూడో విడత ప్రవేశాలు

సిరిసిల్లకల్చరల్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 30 వరకు మూడో విడత ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.కనకయ్య శనివారం ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. http//iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపరచాలని సూచించారు. మొదటి, రెండో విడతలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తిరిగి వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించారు.

ఐటీఐ ఉత్తీర్ణులకు ఉద్యోగావకాశాలు

సిరిసిల్లకల్చరల్: జిల్లాలో ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన, శిక్షణశాఖ సమన్వయకర్త కనకయ్య ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 21న ఎల్లారెడ్డిపేటలోని సాదు వెంకటరెడ్డి ఐటీఐ కళాశాలలో ఉదయం 9 గంటలకు రాత పరీక్ష, మౌఖిక పరీక్షలకు హాజరుకావాలని తెలిపారు. బయోడేటాతోపాటు అన్ని విద్యార్హతల సర్టిఫికెట్లతో నేరుగా హాజరుకావాలని సూచించారు.

అనారోగ్యంతో పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ మృతి


బాబు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ రేసు బాబు(33) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతిచెందాడు. చెత్తను సేకరించే ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న బాబు రెండు రోజుల క్రితం ఛాతిలో నొప్పి వస్తుందని మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ అస్పత్రికి వెళ్లాడు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని కరీంనగర్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మరణించాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాబు కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామపంచాయతీ కార్మికులు కోరుతున్నారు.

పాడెమోసిన సర్పంచ్ నేవూరి

పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ రేసు బాబు అంత్యక్రియల్లో సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి పాడె మోశారు. మృతదేహాన్ని చూడటానికి గ్రామస్తులు తండోపతండాలుగా తరలివచ్చారు.

బాబు కుటుంబాన్ని ఆదుకుంటాం

ఎల్లారెడ్డిపేటలో అనారోగ్యంతో మరణించిన పంచాయతీ కార్మికుడు బాబు కుటుంబాన్ని మంత్రి కేటీఆర్ సహకారంతో ప్రభుత్వపరంగా ఆదుకుంటామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన సింగిల్‌విండో వైస్‌చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి తల్లి అనారోగ్యంతో మరణించగా ఈ రెండు కుటుంబీకులను శనివారం పరామర్శించారు. పందిర్ల పర్శ రాములుగౌడ్, ఎద్ల సందీప్, ఎద్ల లక్ష్మణ్, శివ రామకృష్ణ, కళ్యాణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగడ్డలో తాళం వేసిన ఇంట్లో చోరీ

చందుర్తి(వేములవాడ): మండలంలోని మర్రిగడ్డకు చెందిన బొడిగె శంకర్‌కు చెందిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రెండు తులాల బంగారాన్ని శుక్రవారం రాత్రి ఎత్తుకెళ్లారు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాలు. బొడిగే శంకర్‌కు రెండిళ్లు ఉండగా.. పాత ఇంటికి తాళం వేసి.. కొత్త ఇంటిలో నిద్రించేందుకు వెళ్లారని తెలిపారు. ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి తులం పావు గొలుసు, అరతులం పుస్తెలు, పావుతులం చెవికమ్మలు ఎత్తుకెళ్లారని ఎస్సై వివరించారు.

చినుకుపడితే చీకటే..

- వర్షం పడితే చందుర్తిలో అంధకారం
- సెస్ అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బంది
- రాత్రిపూట అవస్థలు పడుతున్న ప్రజలు


చందుర్తిలో విద్యుత్‌లైన్ మరమ్మతు చేపడుతున్న సెస్ సిబ్బందికి సహకారం అందిస్తున్న యువకులు

చందుర్తి(వేములవాడ): చినుకు పడితే చందుర్తి మండల కేంద్రంలో అంధకారం అలుముకుంటుంది. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుండడంతో మండల కేంద్రవాసులు ఇబ్బందులు చెప్పలేనివిగా ఉన్నాయి. వర్షం పడితే చాలు చందుర్తి వాసులకు జాగారమే.

వేసవి నుంచి ఇదే పరిస్థితి

చందుర్తి మండల కేంద్రంలోని ప్రజలను కరెంటు కష్టాలు వేసవి నుంచే వెంటాడుతున్నాయి. వర్షం పడిన చాలు ఏదో సమస్య వచ్చి విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఓ వైపు వర్షం మరో వైపు చీకటితో సతమతమవుతున్నారు. రాత్రిపూట గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. రాత్రి పూట వర్షంలో మరమ్మతులు చేయలేక, ప్రజలు చీకటిలో ఉంటున్నారు. వేసవిలో ఈదురు గాలులతో ప్రారంభమైన ఈ సమస్యను పరిష్కరించడంలో సెస్ సిబ్బంది విఫలమవుతున్నారు. సెస్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారింది. నాలుగు నెలలుగా వర్షం పడిన ప్రతి రోజు రాత్రే గ్రామం చీకటిపడుతుంది. లూజ్‌లైన్లు, చెట్లకొమ్మలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. రాత్రి పూల అంతరాయం ఏర్పడిన ప్రతీసారి సెస్ సిబ్బంది టార్చిలైట్లు పట్టుకొని స్తంభాల వెంట తిరుగుతున్నారు. నాలుగైదు గంటలపాటు శ్రమిస్తే తప్పా విద్యుత్‌బ్రేక్‌కు కారణాలు తెలవడం లేదు.

పరిష్కరించడం లేదు



నాలుగు నెలలుగా విద్యుత్ అంతరాయం కలుగుతుంది. రాత్రి పూట కరెంటు పోవడంతో దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. కరెంటు పోయిందని సిబ్బందికి చెప్పేందుకు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదు.

– వెంగళ అంజయ్య, చందుర్తి

లూజ్ వైర్లను సరిచేయాలి



విద్యుత్‌లైన్ వెంట చెట్లకొమ్మలు, లూజ్ వైర్లు ఉండడంతో వర్షం పడిన ప్రతీసారి కరెంటు నిలిచిపోతుంది. ఎండాకాలంలో చెట్లకొమ్మలు, లూజ్‌లైన్లను సరిచేసుకుంటే బాగుండేది.

– పులి సత్తయ్య, చందుర్తి

వాతావరణ పరిస్థితులతోనే..

వాతావరణ పరిస్థితులతోనే విద్యుత్ సరఫరాలో ఆటంకాలు ఏర్పడుతున్నాయి. వర్షం పడినప్పుడు గాలి వీస్తేనే సాంకేతికపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వర్షంలోనే మా సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారు.

– మహేశ్, సెస్ ఏఈ, చందుర్తి.

చోరీకి గురైన కారు దొరికింది

- నలుగురి అరెస్టు
- నాలుగురోజులు.. ఐదు బృందాలు
- లింగంపేట శివారులో రెండు కార్లు స్వాధీనం


అరెస్టు చూపుతున్న పోలీస్ అధికారులు

చందుర్తి(వేములవాడ): చందుర్తిలో అపహరణకు గురైన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చోరీలో పాల్గొన్న నిందితులతోపాటు మరో కారును మండలంలోని లింగంపేట శివారులో స్వాధీనం చేసుకున్నట్లు చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం వివరాలు వెల్లడించారు. చందుర్తికి చెందిన లింగంపల్లి జలందర్, మోతుకుపల్లి రాజశేఖర్ కలిసి పాత కార్లను కొని, విక్రయించేవారు. వీరి మధ్య డబ్బుల పంపకంలో తేడాలు వచ్చాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని లింగంపల్లి జలందర్‌కు చెందిన కారును ఈనెల 14వ తేదీ అర్ధరాత్రి చందుర్తికి చెందిన మోతుకుపల్లి రాజశేఖర్, మోతుకుపల్లి వేణు, మోతుకుపల్లి తిరుపతి, బొల్లు భరత్‌కుమార్ అపహరించారు. గంభీరావుపేట మండలం ముస్తఫానగర్‌లోని బంధువు పిల్లి బాబు ఇంటి వద్ద పెట్టారు. బాధితుడు జలంధర్ ఫిర్యాదుతో చందుర్తి, రుద్రంగి ఎస్సైలు అశోక్, రాజశేఖర్, కోనరావుపేట ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డితో కలిపి ఐదు బృందాలు తీవ్రంగా గాలించాయి. చందుర్తి, కోనరావుపేట, రుద్రంగి, కథలాపూర్ మండలాలతోపాటు వేములవాడ, సిరిసిల్ల సీసీ ఫుటేజీల ఆధారంగా అపహరణకు గురైన కారుతోపాటు మరో కారులో కలిసి కోరుట్ల వైపు వెళ్తుండగా చందుర్తి మండలంలోని లింగంపేట శివారులు పట్టుకున్నారు. రెండు కార్లల్లో ప్రయాణిస్తున్న అపహరించిన మోతుకుపల్లి రాజశేఖర్, మోతుకుపల్లి వేణు, మోతుకుపల్లి తిరుపతి, బొల్లు భరత్‌కుమార్‌తోపాటు కారు భద్రపర్చిన ముస్తఫానగర్‌కు చెందిన పిల్లి బాబును అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన ఐదుగురిని, రెండు కార్లు, ఐదు సెల్‌ఫోన్లను కోర్టులో ప్రవేశపెట్టినట్లు సీఐ వివరించారు.


పథకం ప్రకారం అపహరణ

మోతుకుపల్లి వేణుతోపాటు మరో ఆరుగురు ఈనెల 9న వినాయక విగ్రహాన్ని ఆర్డర్ చేసేందుకు కోరుట్లకు వెళ్లారు. అదే సమయంలో కారుకు డమ్మీ తాళం చెవిని వేణుతోపాటు మరొకరు అక్కడే తయారు చేయించినట్లు ప్రచారంలో ఉంది. తాళం చెవి తయారు చేయించిన వారిలో ఇద్దరు ఉండగా, మరొకరి పేరు తప్పించినట్లు ప్రచారం జరుగుతోంది. డమ్మీ తాళం చెవిని దగ్గరు పెట్టుకున్నారు. అదునుచూసి కారును డమ్మీ తాళం చెవితో ఈనెల 14న ఎత్తుకెళ్లారు. అదే సమయంలో చేజింగ్‌కు మరో కారును వినియోగించినట్లు తెలిసింది. నాలుగు రోజుల్లో కేసు ఛేదించడంతో మండల ప్రజలు పోలీసులను అభినందిస్తున్నారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తి రిమాండ్

సిరిసిల్లక్రైం: వ్యవసాయ భూమి వద్ద ఉన్న గొడవలతో ఒకరి మృతికి కారణమైన వ్యక్తిని రిమాండ్‌కు పంపినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు. బోయినపల్లి మండలం రత్నంపేటకు చెందిన గురిజాల చంద్రశేఖర్(53)కు తన పొలం పక్కనే వ్యవసాయ భూమి ఉన్న ఎడిగెల మల్లేశంతో గట్టు పంచాయితీ ఉంది. ఈక్రమంలో కొన్నిసార్లు గొడవ జరిగింది. ఈ విషయం పలుమార్లు పెద్దల సమక్షంలో, ఠాణాలో ఫిర్యాదులు, సంప్రదింపులు జరిగాయి. చంద్రశేఖర్ పొలంలో నష్టం జరుగుతుందని గెట్టు పంచాయితీ తేల్చాలని అడిగిన మల్లేశం వినకపోవడంతోపాటు చస్తే చావు అనే మాటలన్నాడు. దీంతో మనస్తాపానికి గురైన చంద్రశేఖర్ పురుగుల మందుతాగగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీనిపై మృతుని కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి మల్లేశంను రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

కొదురుపాకలో వ్యక్తి అదృశ్యం


నరాల నగేశ్

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కొదురుపాకకు చెందిన నరాల నగేశ్(53) అదృశ్యమైనట్లు ఎస్సై మహేందర్ శనివారం తెలిపారు. నగేశ్ మానసికస్థితి సరిగ్గా లేక ఇబ్బంది పడుతున్నాడు. ఈనెల 17న కొదురుపాక బస్టాండ్‌లో ఏదో వాహనం ఎక్కాడని అతని కుమారుడు ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత


లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంగ్లిష్ బుక్స్ పంపిణీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇంగ్లిష్ మార్క్స్ గేనర్ పుస్తకాలను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పయ్యావుల రామచంద్రం, హెచ్ఎం రామారావు, ఉపాధ్యాయులు లింగాల శ్రీనివాస్, బాధ గోపి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిరిసిల్లటౌన్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్ల అధ్యక్ష, కార్యదర్శులు మంద అనిల్, మల్లారపు ప్రశాంత్ కోరారు. సిరిసిల్లలోని అంబేడ్కర్‌చౌరస్తాలో శనివారం ధర్నా చేపట్టి మాట్లాడారు. ప్రభుత్వ విధివిధానాలు లోపభూయిష్టంగా ఉండడంతోనే నిరుపేద విద్యార్థులు చదువుకోలేక పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యారంగ సమస్యలపై ఇప్పటికే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జీపుయాత్ర కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఈనెల 21న కలెక్టరేట్ ముట్టడికి రావాలని కోరారు. ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్, ఆదిత్య అభిషేక్, వేణు, రామ్‌చరణ్, సాయిచరణ్, నాగరాజు, ప్రవీణ్, నవీన్ ఉన్నారు.

అనుచరులతో సమావేశమైన ‘చల్మెడ’

వేములవాడ: వేములవాడ బీఆర్ఎస్ పార్టీలో నెలకొన్న ఉత్కంఠకు సోమవారం తెరపడనుందన్న సమాచారం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే రమేశ్‌బాబు జర్మనీ పర్యటనలో ఉండగా, నియోజకవర్గంలో ఆపార్టీ నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు తమ అనుచరులతో అంతర్గతంగా పనులు చేసుకుంటూ వెళ్తున్నారు. ఈక్రమంలో స్థానిక మల్లారం జంక్షన్ వద్ద గల చల్మెడ ఆఫీస్‌లో శనివారం మూడు మండలాలకు చెందిన ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. పార్టీ టిక్కెట్లు ఈనెల 21న ప్రకటించనున్న నేపథ్యంలో చేపట్టాల్సిన వ్యూహాన్ని చర్చించుకున్నట్లు తెలిసింది. మొత్తానికి చెన్నమనేని వర్సెస్ చల్మెడ అంతర్గత పోరుకు మరికొద్ది గంటల్లోనే ఫుల్‌స్టాప్ పడనుందని తెలుస్తోంది.

అమరుల కుటుంబాలను కలిసిన రాజన్న

వీర్నపల్లి(సిరిసిల్ల): జనశక్తి అగ్రనేత కూర రాజన్న వీర్నపల్లి మండలం గర్జనపల్లిలోని అమరుల కుటుంబాలను శనివారం కలిశారు. అమరుల కుటుంబాల ప్రస్తుత స్థితిగతులను తెలుసుకున్నారు.

ఆత్మస్థైర్యానికి జూడో దోహదం

- క్రీడాకారులు అన్ని రంగాల్లో రాణిస్తారు
- రాష్ట్రస్థాయి జూడోపోటీలను ప్రారంభించిన కలెక్టర్ గోపి
- 280మంది క్రీడాకారులు, 30మంది రెఫరీలు హాజరు


జూడో క్రీడాకారులతో కలెక్టర్ గోపి, తదితరులు

కరీంనగర్‌స్పోర్ట్స్: ప్రస్తుతకాలంలో విద్యార్థుల ఆత్మస్థైర్యానికి జూడో క్రీడ దోహదపడుతుందని కలెక్టర్ బి.గోపి అన్నారు. కరీంనగర్‌లోని మానేరు ఉన్నత పాఠశాలలో జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 8వ రాష్ట్రస్థాయి జూనియర్స్ జూడో చాంపియన్‌షిప్ పోటీలను శనివారం రాత్రి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. క్రీడలకు ఆదరణ పెరుగుతోందని అన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం అన్ని సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. కొన్నేళ్లుగా రాష్ట్ర, జాతీయస్థాయి జూడో పోటీలను నిర్వహిస్తున్న మానేరు విద్యాసంస్థలను అభినందించారు. మైత్రి గ్రూప్స్ చైర్మన్ కొత్త జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ఫుట్‌బాల్ తరువాత అత్యంత ప్రజాదరణ ఉన్న క్రీడ జూడో అన్నారు. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు దుస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. మానేరు విద్యాసంస్థల అధినేత, జిల్లా జూడో సంఘం అధ్యక్షుడు కడారి అనంతరెడ్డి, రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలకు తెలంగాణవ్యాప్తంగా సుమారు 280మంది క్రీడాకారులు, 30మంది కోచ్‌లు, మేనేజర్లు, రెఫరీలు హాజరైనట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తెలంగాణ జట్లకు ఎంపిక చేస్తామని తెలిపారు. బంగారు పతకం సాధించినవారిని ఈనెల 28నుంచి సెప్టెంబర్ 1వరకు న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ గోపి పోటీలను ప్రారంభించారు. డీవైఎస్ఓ కీర్తి రాజవీరు, భారత జూడో సమాఖ్య కోశాధికారి బి.కైలాస్‌యాదవ్, జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షులు తుమ్మల రమేశ్‌రెడ్డి, జిమ్నాస్టిక్స్, సైక్లింగ్ క్రీడా సంఘాల అధ్యక్షులు నిరంజనాచారి, మధుసూదన్‌రెడ్డి, మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు అంజన్న సన్నిధిలో విచారణ


విచారణ జరుపుతున్న ఏడీసీ కృష్ణవేణి

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి హుండీ ఆదాయాన్ని ఈనెల 9న లెక్కించిన విషయం విదితమే. ఈ సమయంలో చైర్మన్ తిరుకోవెళూర్ మారుతీస్వామి బంగారు లేదా వెండి ఆభరణాలు తీశారని ఆరోపిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌కు ఆలయ బోర్డు సభ్యుడు జున్న సురేందర్, ముత్యంపేట సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈమేరకు దేవాదాయ శాఖ ఏడీసీ కృష్ణవేణి శనివారం కొండగట్టుకు చేరుకున్నారు. హుండీ ఆదాయం లెక్కించిన పరిసరాలు పరిశీలించారు. పోలీస్ ఔట్‌పోస్టుకు వెళ్లి సీసీ ఫుటేజీలు తనిఖీ చేశారు. వాటిని పెన్‌డ్రైవ్‌లోకి కాపీ చేసుకున్నారు. ఈసందర్భంగా తిరుకోవేళూర్ మారుతీస్వామి, ఫిర్యాదుదారు, బోర్డు సభ్యుడు జున్న సురేందర్, బోర్డు సభ్యుడు వోల్లాల లింగాగౌడ్, అర్చకులు పెద్ద జితేంద్రప్రసాద్ స్వామి, చిరంజీవస్వామి, కపిందర్ నుంచి వాంగ్మూలాలు సేకరించారు. అయితే, దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు హుండీ ఆదాయం లెక్కింపు సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై విచారణ జరిపామని, నివేదికను కమిషనర్‌కు అందజేస్తామని కృష్ణవేణి తెలిపారు. కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, కొండగట్టు ఆలయ ఈవో వెంకటేశ్, ఏఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

డబుల్ కిక్కు

- ఖజానాకు రూ.40.72 కోట్లు
- జిల్లాలోని 48 షాపులకు 2,036 దరఖాస్తులు
- అదృష్టంపై లెక్కలేస్తున్న వ్యాపారులు
- 21న మద్యం దుకాణాలకు లక్కీ డ్రా
- పాస్ ఉన్న వారికే ఎంట్రీ

సిరిసిల్లక్రైం: జిల్లాలోని మద్యం దుకాణాలకు గతం కంటే రెట్టింపు దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని 48 మద్యం దుకాణాలకు గతంలో 944 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఈసారి 2,036 దరఖాస్తులు రాగా ఖజానాకు రూ.40.72 కోట్లు సమకూరాయి. శుక్రవారం రాత్రి వరకు నిర్వహించిన టెండర్ ఫారాల స్వీకరణలో 2,032 దరఖాస్తులు రాగా హైదరాబాద్‌లోని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో గెజిట్ నంబర్ 4, 5, 14, 16 షాపులకు దరఖాస్తులు వచ్చాయి. దీంతో జిల్లాలోని వైన్‌షాపులకు దాఖలైన మొత్తం దరఖాస్తులు 2036కు చేరాయి. ఒక్కో వైన్‌షాప్‌నకు పదుల సంఖ్యలో దరఖాస్తులు రావడంతో లక్కు దక్కాలని వ్యాపారులు అదృష్టంపై అంచనాలు వేసుకుంటున్నారు.

సిండికేట్ షురూ...

జిల్లాలోని కొన్ని వైన్‌షాపులకు 10 నుంచి 20 లోపు దరఖాస్తులు వచ్చాయి. సంబంధిత షాపులకు దరఖాస్తు చేసిన వారి వివరాలను సేకరించి అందులో లక్కు ఎవరికి దక్కిన దరఖాస్తు చేసుకున్న వారు వాటాదారులుగా ఉండేలా ప్రయత్నాలు చేస్తున్నారు. 20 లోపు దరఖాస్తులు వచ్చిన వైన్‌షాపులు జిల్లాలో ఐదు ఉన్నాయి. వీటికి దరఖాస్తు చేసుకున్న వారందరూ ఒక గ్రూపుగా మారేందుకు చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. అనుకున్నట్లు జరిగితే ఐదు షాపులపై దరఖాస్తు చేసిన వ్యాపారులు ఈ రెండేళ్ల మద్యం వ్యాపారంలో వాటాదారులుగా ఉంటారన్న మాట.

దేవుళ్లకు మొక్కులు

మద్యం దుకాణం తమకే దక్కాలంటూ పలువురు వ్యాపారులు వేములవాడ రాజన్నకు మొక్కులు చెల్లించుకునేందుకు సిద్ధమవుతున్నారు. తనకు వైన్‌షాపు దక్కితే రాజన్నకు కోడెమొక్కు చెల్లిస్తానని ఓ వ్యాపారి శుక్రవారం రాత్రి బహిరంగంగానే తన నమ్మకాన్ని బయటపెట్టాడు. వైన్‌షాపులకు డ్రా తీసేందుకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాట్లు సాగుతున్నాయి. ఎంట్రీ పాస్ ఉన్న వారికి మాత్రమే ప్రవేశం ఉంటుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

సైబర్ మోసం రూ.7.67 లక్షలు మాయం

- టెలిగ్రామ్ లింక్ పేరుతో ఆన్‌లైన్ మోసం
- మోసపోయిన స్తంభంపల్లి యువకుడు
- అత్యాశకు పోవద్దు : ఎస్సై మహేందర్

బోయినపల్లి(చొప్పదండి): అత్యాశకు పోయి రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని స్తంభంపల్లికి చెందిన యువకుడు రూ.7.67లక్షలు పోగొట్టుకున్నాడు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాలు. స్తంభంపల్లికి చెందిన అక్కెనపెల్లి హరీశ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ మెడికల్ బయోటెక్నాలజీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆన్‌లైన్‌లో వచ్చిన మెస్సేజ్‌తో టెలిగ్రామ్ లింక్ ఓపెన్ చేశాడు. మొదట యూట్యూబ్ ద్వారా కొన్ని వీడియోలు పంపితే నెలకు రూ.3వేలు ఇస్తామని చెప్పడంతో అలా చేశాడు. కొద్ది రోజులకు యాప్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే రెట్టింపు అవుతాయని నమ్మబలకడంతో ఈనెల 9, 10, 11 తేదీలలో ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా వారు చెప్పిన నంబర్లకు రూ.7.67లక్షలు పంపించాడు. చివరికి యాప్ ఫేక్ అని తెలుసుకొని 1930 నంబర్‌కు ఫిర్యాదు చేశాడు. ఎస్సై మహేందర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని, అత్యాశకు పోయి ఆన్‌లైన్‌లో డబ్బులు పెట్టి మోసపోవద్దని హెచ్చరించారు.

వారం రోజుల్లో జీవో జారీచేయాలి

- నివేశన స్థలాలకు రిజిస్ట్రేషన్ కల్పించాలి
- సీపీఎం కార్యదర్శి మూశం రమేశ్


మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: కార్మికవాడల్లోని పేదల ఇళ్లకు రిజిస్ట్రేషన్ హక్కులు కల్పిస్తామన్న మాటను మంత్రి కేటీఆర్ వారం రోజుల్లోపు నిలుపుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ డిమాండ్ చేశారు. బీవైనగర్‌లోని పార్టీ ఆఫీసులో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. సిరిసిల్లలోని కార్మికవాడలైన బీవైనగర్, సుందరయ్యనగర్, ఇందిరానగర్, గణేశ్‌నగర్, తారకరామానగర్ ప్రాంతాల్లో వేలాది మందికి ప్రభుత్వం నివేశన స్థలాలిచ్చిందన్నారు. వీటికి రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించేలా జీవో తీసుకొస్తామని కేటీఆర్ పక్షం రోజుల క్రితం మాట ఇచ్చారన్నారు. ఆర్థిక స్థోమత లేకుండా ఇప్పటి వరకు కూడా ఇల్లు కట్టుకోని పేదలకు గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని కోరారు. కోడం రమణ, సూరం పద్మ, శ్రీరాం సదానందం, ఎలిగేటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

‘కులాలబంధు’లతో మభ్యపెడుతున్నారు


మాట్లాడుతున్న కె.కె.మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కులాల బంధులతో ప్రజలను మంత్రి కేటీఆర్ మభ్యపెడుతున్నారని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి విమర్శించారు. ఎల్లారెడ్డిపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం మహేందర్‌రెడ్డి మాట్లాడారు. సిరిసిల్లలో గీతకార్మికులకు రెండెకరాల స్థలం ఇవ్వడం అభినందనీయమన్నారు. గౌడ సంఘం నేతలు గట్టిగా మాట్లాడి పోరాడితే ఈ పనులు జరిగాయన్నారు. మంత్రి కేటీఆర్‌ను విమర్శిస్తే తప్ప పనులు చేయడం లేదన్నారు. దళితబంధు, బీసీబంధు, మైనార్టీబంధు, క్రిస్టియన్ బంధు ఇలా.. అన్ని కులాలను మోసం చేస్తున్నారన్నారు. కులాల పేరిట సమాజంలో అడ్డుగోడలు నిర్మిస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, పట్టణాధ్యక్షుడు చిన్ని బాబు పాల్గొన్నారు.